# గుండెల మీద కుంపటి

దాదాపు పాతిక సంవత్సరాల నుంచీ అన్ని రకాల రచనలూ రాసి పత్రికల్లో అచ్చు వేస్తున్నాను గాని నాకు తగినంత పేరూ, డబ్బూ రాలేదని చాలా బాధగా ఉంది. దాదాపు పదిహేనేళ్ల క్రితం ఒకానొక పబ్లిషరు మిత్రుడు నా కథల పుస్తకం ఒకటి అచ్చు వేశాడు. నాకు డబ్బేమీ ఇవ్వలేదు. ఒక యాభై కాపీలు మాత్రం ఇచ్చాడు. వాట్ని అప్పుడొకటీ అప్పుడొకటీ నా మిత్రులకు కాంప్లిమెంటరీ కాపీలుగా పంచిపెట్టేశాను. ఒక్కటంటే ఒక్క పుస్తకం మాత్రం బైండు చేయించి దాచుకున్నాను. నాటి నుంచి నేటి వరకూ అచ్చయిన నా ఏకైక పుస్తకం అదే.

మరో ఆరు నెలల్లో నా సాహిత్య జీవితానికి పాతికేళ్లు నిండిపోతాయి. స్నేహితులయిన కొందరు మిత్రులతో నా సాహిత్య జీవిత రజతోత్సవం చెయ్యమని చెబుతున్నాను. ఎవరూ వినిపించుకోవడం లేదు.

ఇది కాదు పనని ప్రావిడెంట్ ఫండ్‌లోంచి అయిదు వేలులోను పెట్టి నా వచన కవితల్లో ఉత్తమమైనవాటిని ఎంచి ఒక పుస్తకంగా అచ్చు వేసుకున్నాను. నూట పాతిక పేజీల గ్రంథం తయారయింది. అట్టతోసహా పుస్తకం తయారై నా చేతికి వచ్చిన రోజున నేను పొందిన ఆనందం వర్ణించడం– పరమ అతిశయోక్తులు రాసే ప్రాచీన కవిని తీసుకొచ్చినా సాధ్యం కాదు.

ఊళ్లో మిత్రుల్ని బ్రతిమాలగా ఒక చిన్న సైజు ఆవిష్కరణ సభ పెట్టేరు. నాకు ఇష్టమైన ఒక కామ్రేడ్, గ్రంథాన్ని ఆవిష్కరించేడు. ఏ పెద్ద ఆఫీసరు చేతనో చేయించకుండా కామ్రేడ్‌చేత ఎందుకు చేయించానంటే నా కవితల్లో సామాజిక చైతన్యాన్ని, సమగ్ర విప్లవాన్నీ వస్తువుగా తీసుకొని వ్రాసిన వాటినే ఈ సంపుటిలో చేర్చాను. ఇందులో కొన్ని కవితల్ని శ్రీ శ్రీ సైతం మెచ్చుకున్నారంటే వాటి స్థాయి మీరర్థం చేసుకోవచ్చును.

ఆవిష్కరణ వార్తలు ఫోటోతోసహా పేపర్లలో పడలేదు గాని, మామూలుగా పడ్డాయి. మన పత్రికలు రాజకీయ వార్తల కిచ్చిన ప్రాధాన్యం సాహిత్య వార్తలకు ఎప్పుడూ ఇవ్వవు. పోనీ మరి కొంచెం ప్రముఖంగానయినా ప్రచురించవు.

ప్రావిడెంట్ ఫండ్‌తోపాటు, మరి కొంత చేతి సొమ్ముకూడా పెట్టి వెయ్యి ప్రతులు వేయించాను. ఆవిష్కరణ సభ మర్నాడు సెలవుపెట్టి పుస్తకాల కట్టలు ముందుకు వేసుకు కూచుని ముఖ్యమైన మిత్రులకూ, పత్రికలవారికీ, కాంప్లిమెంటరీ కాపీలు పంపించాను. ఈ యజ్ఞం దాదాపు సాయంత్రం వరకూ సాగింది. అన్ని పత్రికలవారికీ రెండేసి ప్రతుల చొప్పున "సమీక్షార్థం" పుస్తకాల పాకెట్లు సిద్ధంచేసేసరికి చేతులు పీకేయి. నడుంసలపడం ప్రారంభించింది. మిగిలినవి రేపు కట్టవచ్చునని లేస్తుంటే సుబ్బారావు వచ్చాడు.

"నిన్న నీ గ్రంథావిష్కరణసభకు వచ్చానుగ్గాని చివరి వరకూ ఉండలేకపోయాను, ఏమీ అనుకోకు' అన్నాడు.

లోపలి గదిలోంచి ఇవతలికి వచ్చాను.

వరండాలో కుర్చీలు వేసుకుని కూచున్నాం. మా ఆవిడ ఇద్దరికీ కాఫీ లిచ్చింది. కబుర్లు ప్రారంభించాం.

"ధర ఎంత పెట్టేవూ?" అన్నాడు సుబ్బారావు.

"ఆరు రూపాయలు పెట్టాను. చాలా తక్కువ. గ్రంథాలయాకు తప్ప ఇతరులకు అయిదు రూపాయలకే ఇచ్చేస్తాను" అన్నాను.

జేబులోంచి అయిదు రూపాయల కాయితం తీసి–

"నాకో పుస్తకం ఇయ్యి" అన్నాడు సుబ్బారావు.

డబ్బులిచ్చి నా పుస్తకం కొంటున్న మొదటి మిత్రుడతనే. నిన్నటికి నిన్న ఆవిష్కరణ సభలో సాహిత్యం సంగతీ, వచన కవిత సంగతీ తెలీనివాళ్లకు సైతం డజను కాపీలు పంచిపెట్టాను. ఆ పరిస్థితి అలాంటిది. ప్రాణం ఉసూరుమని పోయింది. కాని సుబ్బారావు దగ్గిర డబ్బులు పుచ్చుకుందుకు మొహమాటం అడ్డొచ్చింది. పాతికేళ్ల స్నేహం!

పుస్తకం తీసుకొచ్చి అభినందనలతో అని రాసి ఇచ్చి, డబ్బు లెందుకులే అన్నాను.

"అలా అంటే వల్లకాదు. డబ్బులు తీసుకోవలసిందే, ముక్కూ మొహం తెలీనివాళ్లకు విరాళం ఇవ్వడం లేదూ. అంతకంటేనా?" అని బలవంతంగా డబ్బులిచ్చాడు. ఆ తరవాత కాస్సేపు కబుర్లాడి వెళ్లిపోయాడు.

మర్నాడు బెజవాడలోని ఇద్దరు పబ్లిషర్లకు అమ్మి పెట్టమని ఉత్తరం రాసి వందేసి కాపీలు చొప్పున పార్సిలుచేసి పంపించాను. తక్కిన పుస్తకాలు జాగ్రత్తగా కట్టలు కట్టి అటకమీద సర్దేను. ఒక పాతిక పుస్తకాలు మాత్రం అలమారులో అందుబాటులో ఉంచుకున్నాను.

వారం పదిరోజుల తరవాత గోపాలం మేస్టారు కలిశారు. ఆయన నాకు సన్నిహిత మిత్రుడు కాదు గాని, చిరకాల పరిచయస్తుడే. లౌక్యం బాగా తెలిసినవాడు. 'తెలుగు వ్యాకరణం' పుస్తకాలు అచ్చువేసి, హెడ్‌మాస్టర్లని పట్టుకుని బాగా అమ్ముకోగలిగాడు. 'అనువాద అభ్యాసాలు' పుస్తకాలు కూడా బాగానే అమ్ముకున్నాడు. ఈ మధ్యనే ఒక పుస్తకాల షాపువాడితో ఒప్పందం కుదుర్చుకుని భారీఎత్తున గైడ్‌లు అచ్చువేశాడు.

"కవితా సంపుటి అచ్చు వేశారటగా. సంతోషం. అమ్మకాలెలా ఉన్నాయి?" అన్నారు గోపాలంగారు నవ్వుతూ.

కొన్ని పుస్తకాలు సమీక్షలకూ, కొన్ని పుస్తకాలు బెజవాడలోని పుస్తకాల షాపులవాళ్లకూ పంపించానని చెప్పాను.

"పుస్తకాల అమ్మకం ఎలా ఉన్నా, పుస్తకం అచ్చువేసుకున్నాన్న సరదా తీరింది. ఏమంటారు?" అనుకుంటూ వెళిపోయారు. ఎవరో మెత్తగా గుండెల్లో గునపం గుచ్చినట్టయింది.

స్వంతంగా పుస్తకం అచ్చు వేసుకోవద్దనీ, వేసుకుంటే ఏ గైడులో వేసుకోమనీ చెప్పారు గోపాలంగారు. నేనాయన మాట వినలేదు.

ఆరు నెలలు గడిచింది.

తక్కువ ప్రచారంగల రెండు సాహిత్య పత్రికలవారు నా పుస్తకాన్ని సమీక్షించారు. కొన్ని వార పత్రికలవారు "స్వీకారం"లో పుస్తకం వివరాలు వేసి సరిపెట్టేశారు. ఈ ఆరు నెలల్లోనూ ఒక పది పుస్తకాలు పోస్టులో పంపి ఉంటాను,ఆరేసిరూపాయిల మనియార్డర్లు పుచ్చుకుని. మా వూళ్లోని అతి పెద్ద పుస్తకాల షాపులో పెట్టిన పది పుస్తకాల్లోనూ, ముత్యం మూడు పుస్తకాలు మాత్రమే చెల్లాయి.

అటకమీద పుస్తకాల కట్టలు చూస్తున్న కొద్దీ గుండెలు గుభేలు మంటున్నాయి. ఆరువేల చిల్లర– అక్కరకు రాకుండా పోయింది.

మా వూళ్లో ఒక చిన్న సైజు సాహిత్య సభ జరిగింది

ఉపన్యాసకుడిగా నన్ను పిలిచారు. అందమైన ప్లాస్టిక్ చేతిసంచిలో ఒక పదిపుస్తకాలు పట్టుకునివెళాను. అభిమానులకు అమ్ముదామని. ఒక పుస్తకం అమ్మాను. అరడజను పుస్తకాలు కాంప్లిమెంటరీ కాపీలుగా మిత్రులకు వెళ్లిపోయాయి. తక్కినవి తీసుకొచ్చేశాను. ఒక పుస్తకం అమ్మి అయిదు రూపాయలు సంపాదించాను. అక్కడికదే సంతోషం. డబ్బు రాకపోతే పోయె ఒక అరడజను పుస్తకాలు వెలుగు చూశాయి కదా. కానివ్వండి.

ఒక్క ఆలోచన వచ్చింది.

మా ఊరి జూనియర్ కాలేజీ వార్షికోత్సవాలు వస్తున్నాయి. ప్రిన్సిపల్‌గారు కొద్దిగా తెలుసును. ఆయన్ని కలుసుకుని ఒక అరడజను పుస్తకాలిచ్చి "డబ్బక్కర్లేదు, ఉత్తినే ఇస్తున్నాను, విద్యార్థులకు బహుమతులుగా ఇవ్వండి" అన్నాను.

ఏమనుకున్నారో ఏమో రెండు పుస్తకాలకు డబ్బిచ్చి రసీదిమ్మన్నారు. "మీ సమస్య నా కర్థమయింది. ఇంత కంటె ఎక్కువగా సహాయం చెయ్యలేక పోతున్నందుకు అన్యథా భావించకండి" అన్నాడాయన. మంచివాడే.

అటకమీద ఉన్న పుస్తకాలకు చెదలు పట్టలేదు గదా అని అనుమానం వచ్చి నిచ్చెన వేసుకుని ఎక్కి చూశాను. అనుకున్నంత పనీ అయింది. చెదలు పట్టడం ప్రారంభించాయి. పుస్తకాలన్నీ కిందపడేసి దులిపి, చెదలు పట్టిన పుస్తకాలు తీసేసి, మిగిలినవి మళ్లీ కట్టలుకట్టి పైన సర్ది, చుట్టూ గమాక్సిన్ జల్లాను. ఎందుకయినా మంచిదని కలరా ఉండలు కూడా తీసుకొచ్చి పుస్తకాల కట్టల మధ్య వేశాను. చూస్తూ చూస్తూ నాశనం చేసుకోలేను గదా. సెలవుకు రోజు పూర్తిగా పాడయిపోయింది. గుండె బరువెక్కిపోయింది. నేను చేసిన పని ఎంత తెలివి తక్కువదో క్రమంగా తెలిసిరావడం ప్రారంభించింది. ఇటీవల కొత్త రచనలేమీ చెయ్య బుద్ధి పుట్టడం లేదు.

నా ఉత్తరాలకు సమాధానంగా బెజవాడలోని పుస్తకాల షాపులవాళ్లు పుస్తకాల అమ్మకం చాలా నిరుత్సాహకరంగా ఉందని రాశారు.

నిన్న సాయంత్రం కూరల మార్కెట్‌లో గోపాలం మేస్టారు కలిశారు.

"ఇల్లు కట్టిచూడు పెళ్లిచేసి చూడు లాంటిదే అచ్చువేసి చూడు అమ్మి చూడు– అనే సామెత కూడాను. ఏ అప్పో సప్పో చేసి అచ్చువేసేస్తాం. అమ్మడం ఎలాగూ? టెక్స్ట్ పుస్తకాల అమ్మకాలు అంతగా బాగులేవు. గైడ్లు అదయినా కొన్ని కంపెనీల అమ్మకాలు బావున్నాయి. తక్కినవి ఎలాగో మెల్లిగా డబ్బు చేసుకుంటాయి. ఆడ పేరుతో రాసే నవలలు ఫరవాలేదు. కథల పుస్తకాలు వెళ్లవు. కవితా సంకలనాలు అస్సలు అమ్మవు. పరిచయస్తు లెవరూ కొనరు. కాంప్లిమెంటరీ కాపీలకోసం ఎదురు చూస్తారు. పరిచయం లేనివాళ్లు పట్టించుకోరు.

"మీరు సరదాకు అచ్చువేశారనుకోండి. తెలిసిన వాళ్లందరికీ పంచిపెట్టండి. లేదా హైదరాబాద్ వెళ్లి డైరెక్టర్ ఆఫ్ లైబ్రరీస్‌ను పట్టుకుని తంటాలు పడండి. హైదరాబాద్ వెళ్లడానికయ్యే ఖర్చులు తీరుబడిగా రావచ్చును.

"నేనుగైడులు ప్రచురించి లాభం గడిద్దామనుకున్నాను. ఆదిలో కొద్దిపాటి లాభం రాకపోలేదు. ఆతరవాత బెడిసికొట్టింది. హేమా హేమీల్లాంటి కంపెనీలవాళ్లు లక్షలుపోసి వ్యాపారం చేస్తూ మార్కెట్లో పోటీ తగుల్తుంటే నా బోడి గైడ్లు ఎవరిక్కావాలి.

"అమ్ముడుపోని పుస్తకాలు గుండెలమీద కుంపటి లాంటివి. ఇది నా స్వానుభవం. వ్యక్తిగా ఏ పుస్తకామూ అచ్చు వెయ్యకూడదు. కనీసం ఏ రచయితల సంఘం తరపునైనా అచ్చువేస్తే ఫరవాలేదు" అన్నారు గోపాలంగారు.

ఆయన చెప్పిన విషయాలు నూటికి నూరుపాళ్లూ నిజం.

*రచన : ఆగస్టు, 1984*

*ప్రచురణ : ఆంధ్రప్రభ (ఆదివారం అనుబంధం) 23-9-1984.*